# లైన్ ఆఫ్ ఫైర్

కథ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

వివేక్ ప్రధాన్ సంతోషంగా లేడు. శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లోని ఏర్‌కండిషన్డ్ కంపార్ట్‌మెంట్‌లోని సౌకర్యవంతమైన సీట్ కూడా అతనికి ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. అందుకు కారణం అతనికున్న మానసిక ఆందోళన. అతను ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆఫీస్ పని ముగించుకుని బెంగుళూర్ వెళ్తున్నాడు.





అతనికి విమాన ప్రయాణానికి అర్హత లేదు. విమాన ప్రయాణం చేస్తే, సమయం ఆదా అవుతుందని, తన కంపెనీ అడ్మినిస్ట్రేషన్ వారితో చెప్పాడు. కానీ వాళ్ళు వినలేదు. వాదించినా ప్రయోజనం లేకపోయింది. దాంతో రైల్లో వెళ్ళక తప్పలేదు. తను క్లయింట్‌కి సబ్మిట్ చేసిన ప్రాజెక్ట్ తాలూకు స్పందన వస్తే కానీ అతనికి ఆ ఆందోళన తగ్గలేదు.

వివేక్ తన లాప్‌టాప్ బేగ్‌ని తెరిచి, లాప్‌టాప్‌ని బయటికి తీసాడు. సమయాన్ని వృథా చేయదల్చుకోలేదతను. ఇంటర్నెట్ అంత తేలిగ్గా కనెక్ట్ కాలేదు. టవర్స్ దగ్గర లేవనుకుని, ప్రాజెక్ట్‌ఫోల్డర్‌ని తెరిచాడు.

''మీరు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో పనిచేస్తున్నారా?'' వెనకనించి హిందీలో ఓ కంఠం వినిపించింది వివేక్‌కి.

వెంటనే తలతిప్పి వెనక్కి చూసాడు. తన ఒళ్ళోని లాప్‌టాప్ వంక ఆరాధనగా చూస్తున్న ఒకతను కనబడ్డాడు.

''అవును'' జవాబు చెప్పాడు వివేక్.

ఇప్పుడతనికి విమాన ప్రయాణంలో కోల్పోయిన కొంత ప్రెస్టేజి అక్కడ దొరికినట్లుగా ఫీలయ్యాడు.

అతనివంక పరిశీలనగా చూసాడు వివేక్. కండలు తిరిగిన శరీరం. దారుఢ్యంగా వున్నాడు. అతనొక్కడే ఆ కంపార్ట్‌మెంట్‌కి చెందనివాడుగా కనిపించాడు. పైన తను చూసిన, ఆర్డినరీ సెంకడ్‌క్లాస్‌కి చెందినదిగా కనిపించిన ఏర్ బాగ్ ఎవరిదో అతనికిప్పుడు అర్థమైంది. బహుశా రైల్వే శాఖలో పనిచేసే స్పోర్ట్స్ మేన్ అయి వుంటాడు. ఫ్రీ పాస్‌తో ఈ కంపార్ట్‌మెంట్ ఎక్కి వుండచ్చు.

''ఐటి ఇండస్ట్రీలో పనిచేసేవారంటే, నాకెంతో గౌరవం. మీరు ఆఫీస్‌లో కూర్చుని, కంప్యూటర్‌లో ఏదో రాస్తారు. కానీ అది బయటి ప్రపంచంలోని ఎన్నో పెద్ద పనులని చేస్తుంది''

వివేక్ గర్వంగా నవ్వి చెప్పాడు.

''ఇది మీరు చెప్పినంత తేలికైన విషయం కాదు మిత్రమా! ఏదో ఒకటి రాయడం కాదు. నిజానికి అది రాయడం వెనక చాలా మెదళ్లు పనిచేస్తాయి''

కొద్ది క్షణాలపాటు సాఫ్ట్‌వేర్ పని చేసే విధానం గురించి అతనికి వివరించాలని కూడా వివేక్‌కి అనిపించింది. అయితే అతను కూడా తనలా అమెరికన్ ఈ గిల్ బ్రాండ్ టీషర్ట్. లీ జీన్స్ పేంట్ వేసుకుని వుంటే, బహుశా చెప్పేవాడేమో.

''చాలా కష్టమైన పని మాది''

''అవును అందుకనే మీకు ఎక్కువ జీతాలిస్తారనుకుంటా''

''అంతా మాకు వచ్చే జీతాన్నే చూస్తారు తప్ప, మేము ఆ పని చేయడానికి పడే కష్టాన్ని చూడరు. మన దేశంలో కష్టపడి పనిచేయడం మీద గౌరవం లేదు. దాని విలువ కూడా చాలామందికి తెలియదు. మేము ఏర్‌కండిషన్డ్ గదుల్లో కూర్చుంటాం కాబట్టి, సుఖపడతాం అనుకుంటారు. కాని, కొన్నిసార్లు మాకు చెమటలు పట్టే సందర్భాలు అనేకం వస్తుంటాయి. మీరు కండలతో పని చేస్తే, మేము మెదడుతో పనిచేస్తాం. ఇది కూడా తక్కువ కష్టమేం కాదు. నిజానికి ఎక్కువ మిత్రమా''.

అతను బదులు పలకలేదు. దాంతో వివేక్ చాలామందికిలా అతనికి కూడా ఉన్న ఈ తప్పుడు అభిప్రాయాన్ని పూర్తిగా తొలగించదలచుకున్నాడు.

''ఉదాహరణకి ఈ రైలుంది, మన దేశ రైళ్ళల్లోని టిక్కెట్ రిజర్వేషన్ పద్ధతంతా కంప్యూటరైజ్ చేయబడింది. మీరు ఓ రైలుకి ఏదైనా రెండు స్టేషన్ల మధ్య, వందలకొద్దీ కంప్యూటరైజ్డ్ బుకింగ్ సెంటర్లలో దేంట్లో నించయినా సరే టిక్కెట్‌ని బుక్ చేసుకోవచ్చు.

ఇందుకు ఓ సింగిల్ డేటా బేస్‌తో నమోదయ్యే వేలకొద్దీ అలాంటి ఎంట్రీలు చోటు చేసుకుంటాయి. అందులోని డేటా ఏ మాత్రం తప్పు కాకూడదు. పైగా భద్రంగా వుండాలి. అలాంటి పద్ధతిని రూపొందించి దానికి కోడింగ్ నివ్వడం ఎంతో కష్టమైన పని''

ప్లానెటోరియంలోని టెలిస్కోప్ నించి సుదూరంలో ఉన్న నక్షత్రాలని చూసే స్కూల్ పిల్ల వాడి మొహంలా వుంది అతని మొహం.

''నేను దాన్ని డిజైన్ చేసి కోడింగ్ చేసిన టీంలో పాల్గొన్నాను. ఇప్పుడు నేను ప్రాజెక్ట్ మేనేజర్నయ్యాను''.

''ఓ! ఇప్పుడు మీ పని తేలికయ్యిందన్న

మాట'' ఆనందంగా అడిగాడతను.

''నిచ్చెన ఎక్కి పైకెళ్ళేకొద్దీ జీవితం తేలిక వదు కదా? బాధ్యత ఎక్కువ పనిని ఇస్తుంది. ఇప్పుడు నేను వ్యక్తిగతంగా కోడింగ్ చేయకపోయినా, దాని మొత్తం బాధ్యత నా మీద ఉంటుంది. నిజానికి ఇది ఇంకా వత్తిడితో కూడిన ఉద్యోగం. సరైన సమయానికి పనిపూర్తయ్యేలా చూడడం, అదీ ఎలాంటి తప్పులు లేకుండా సుమా! మేం వర్క్ చేసే కస్టమర్‌కి కూడా నేను బాధ్యుడ్ని. మాటిమాటికీ ఆ కస్టమర్, స్పెసిఫికేషన్స్‌ని మారుస్తూంటాడు. ఆ ప్రకారం, మా పనిని మార్చుకోవడం ఎంతో కష్టంతో కూడింది. ఇంతేకాక, నేను చేసేదాన్ని ఉపయోగించుకునే వాడి సౌలభ్యం కూడా చూడాలి. వీటన్నిటికీ మించి ఇవాళ పూర్తి చేయాల్సిన పనిని నిన్ననే ఎందుకు పూర్తి చేయలేదని అడిగే బాస్‌తో మరీకష్టం. ఈ మొత్తమంతా ఎంత కష్టమంటే, యుద్ధంలో శతృవుల బుల్లెట్లు తగిలే చోట నిలబడడం లాంటిది''.

అతను చటుక్కున, అప్రయత్నంగా తన సీట్లో వెనక్కివాలాడు. అతని మొహం పూర్తిగా పాలిపోయింది. కొన్ని క్షణాలు కళ్ళుమూసుకున్నాడు. అతను ఏదో గొణుగుతున్నట్టుగా పెదవులు కదిలాయి. అతని ప్రవర్తన వివేక్‌కి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఓ నిముషం తర్వాత అతను కళ్ళు తెరచి వివేక్‌వంక చూస్తూ చెప్పాడు.

''మీరు చెప్పింది అర్థమైంది. 'లైన్ ఆఫ్ ఫైర్' అంటాం దాన్ని. అక్కడ ఉండటం ఎంత కష్టమో నాకు అనుభవపూర్వకంగా తెలుసు''

''ఏమిటి మీరనేది?'' వివేక్ ఆసక్తిగా అడిగాడు.

వివేక్ మాటని వినిపించుకున్నట్లుగా లేడతను. ఏదో లోకంలో ఉన్నట్లుగా మాట్లాడసాగాడు.

''పాయింట్ 4875ని స్వాధీనం చేసుకోమని, మాకు ఆజ్ఞజారీ అయినప్పుడు అక్కడ మేము ముప్ఫై మంది మాత్రమే ఉన్నాం. శత్రువులు పైనించి తుపాకీ కాలుస్తున్నారు. తర్వాతి బుల్లెట్ ఎక్కడికి దూసుకు వస్తుందో, ఎవరికి తాకుతుందో తెలియని పరిస్థితి. పైన కటిక చీకటి, ఎముకలు కొరికే చలి. ఉదయం మేము ఆ శిఖరం మీద మువ్వన్నెల జండాని ఎగరేసినప్పుడు నలుగురమే మిగిలివున్నాం''.

''మీరు....?''

''నా పేరు సుశాంత్. నేను నంబర్ 13 జె అండ్ కే రైఫిల్స్‌లో సుబేదార్ని. ఆ రాత్రి పీక్ 4875లో జరిగిన యుద్ధంలో నేను కార్గిల్‌లో వున్నాను. మేము ఆ శిఖరాన్ని ఆక్రమించుకున్న ఉదయం లేత వెలుగులో, మా సైనికుల్లో ఒకరు గాయపడి మంచుమీద పడి వున్నాడని గ్రహించాం. మేం బంకుల్లో దాక్కుంటే, అతను శతృవుల లైన్ ఆఫ్ ఫైర్ లో ఉన్నాడు. ఆ సైనికుడిని రక్షించాల్సిన బాధ్యత నాది. కానీ నా కెప్టెన్ అందుకు నాకు అనుమతిని ఇవ్వలేదు. ఆయనే వెళ్ళి అతన్ని తీసుకు రాదల్చుకున్నానని చెప్పాడు. సైన్యంలో చేరినప్పుడు కేడెట్‌గా 'ముందు దేశరక్షణకి ప్రాధాన్యత నిచ్చి, తర్వాత తను కమాండ్ చేసే మనుషుల రక్షణని చూసుకోవాలని చివరగా వ్యక్తిగతక్షేమం చూసుకోమని' తను ప్రమాణం చేసానని చెప్పాడు. ఆ అవకాశం రావడంతో దాన్నతను అమలుపరిచాడు''.

వివేక్ అతను చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు.

''మా కెప్టెన్ వెళ్ళగానే, శతృవులు ఫైర్ ఓపెన్ చేసారు. ఆయన స్పృహలోలేని ఆ సైనికుడికి తన శరీరాన్ని రక్షణగా వుంచి తీసుకొస్తూంటే, ఆయనకి చాలా బుల్లెట్లు తగిలాయి. ఆ సైనికుడ్ని మా బంకర్‌లోకి చేర్చి ఆయన నేల మీద వాలిపోయాడు. నేను తీసుకోవాల్సిన ఆ బుల్లెట్లు ఆయన తీసుకున్నాడు. లైన్ ఆఫ్ ఫైర్ వుండటం అంటే, ఏమిటో నాకు తెలుసు''.

వివేక్ అతని వంక నమ్మలేనట్లుగా చూసాడు. ఏం మాట్లాడాలో అతనికి అర్థం కాలేదు. అకస్మాత్తుగా తన ఒళ్ళోని లాప్‌టాప్‌ని స్విచాఫ్ చేస్తూంటే, అది ఎంతో ప్రాముఖ్యత లేనిదిగా అతనికి అనిపించింది. అలాంటి వ్యక్తి సమక్షంలో, ఓ వర్క్ డాక్యుమెంట్‌ని ఎడిట్ చేయడం, సాహసం. బాధ్యత ఓ ముఖ్య భాగంగా గల అతన్ని అవమానించినట్లుగా అనిపించింది. అప్రయత్నంగా వివేక్ లేచి అటెన్షన్‌లో నుంచున్నాడు. అతని కుడిచేతి వేళ్ళు సెల్యూట్ చేస్తూ కుడి నుదుటిని తాకాయి.

''మన దేశం కోసం నేను చేయగలిగే అతి తక్కువది ఇది'' వణికే కంఠంతో చెప్పాడు వివేక్.

* * *

పి.ఎస్: ఈ కథలోని పీక్ 4875ని ఆక్రమించుకున్న సంఘటన ఊహకాదు. కార్గిల్ యుద్ధంలో ఇది నిజంగా జరిగింది. కెప్టెన్ బాత్రా తను కమాండ్ చేసే సైనికుడ్ని రక్షించే ప్రయత్నంలో తన ప్రాణాలని త్యాగం చేసాడు. అందువల్ల అతనికి జాతీయ అత్యుత్తమ మిలటరీ అవార్డు అయిన 'పరమవీర్ చక్ర'ని మరణానంతరం ఇచ్చి గౌరవించారు.

వినయంగా జీవించడం నేర్చుకుందాం. మనచుట్టూ ఎంతోమంది గోప్పవారున్న సంగతి మనకి తెలియదు.

★




